"రవీ.... ప్రశాంతంగా కూర్చుని ఆలోచించు.... జరిగిందానికి మీ అమ్మా నాన్న గారు ఎంతో బాధ పడుతున్నారు. గతాన్ని తలచుకుంటూ ఇలా పిచ్చివాడవవుతుంటే వాళ్ళు మరింత బెంగ పెట్టుకుంటున్నారు. ఈ పరిస్థితిలో మీ నాన్నగారు చెప్పిందానికి నువ్వు ఒప్పుకుంటే మంచిది".

రవిని ఎలాగైనా ఒప్పించాలనే పట్టుదల మధుది.

"మధూ! నా మనసు అందుకు అంగీకరించడం లేదు. నా గుండెలో ఇంకా లావణ్య అడుగులు సందడి చేస్తున్నాయి. కళ్ళు మూసినా, తెరచినా లావణ్య కనిపిస్తుంది. లావణ్య మాటలు నా చెవుల్లో మారు మ్రోగుతున్నాయి. లావణ్యను నేను మరచి పోలేను....."

రవి అల్లా అనగానే చాలా సేపటి వరకు మాట్లాడలేదు మధు. భార్యగా లావణ్య రవిని ఎంత ఆరాధించిందో, ప్రేమించిందో, అనురాగం అందించిందో, భర్తగా రవి లావణ్యను ఎంత అపురూపంగా చూసుకున్నాడో మధుకు తెలుసు. మధు, రవి చిన్నతనం నుంచీ స్నేహితులు.... ఇద్దరికీ ఒకే ఊర్లో ఉద్యోగాలు రావడంతో మరింత దగ్గరయ్యారు.... సాయంత్రం ఆఫీసవగానే మధు భార్యను తీసుకుని రవి ఇంటికి వెళ్ళడమో, రవే లావణ్యతో మధు ఇంట్లో గడపడమో జరిగేది. ఆ రెండు కుటుంబాల మధ్య అరమరికలు, దాపరికాలు లేవు. జంటలుగా సినిమాలకు, షికార్లకు, పిక్నిక్‌లకు వెళ్ళేవారు.....

విధి రవి, లావణ్యల జీవితంలో విషం కురిపిస్తుందని ఎవరూ ఊహించలేక పోయారు.

లావణ్య గర్భవతి..... రవి ఆనందం అంతా ఇంతా కాదు. లావణ్యను మరింత అపురూపంగా చూస్తున్నాడు... మధు భార్య లావణ్యను ఏపనీ చేయనివ్వడం లేదు. దూరంగా ఉన్న రవి, లావణ్యల తల్లిదండ్రులు నెలకొకసారయినా వచ్చి చూసి వెళ్ళేవారు...

డెలివరీ టైములో అందరిలో కలవరం....

అమ్మాయా! అబ్బాయా! అని బయట రవి, మధు నవ్వుతూ కబుర్లు చెప్పుకుంటున్నారు...

గదిలోంచి పసికూన ఏడుపు.....

రవి ఆనందంగా మధును కౌగలించు కున్నాడు...

ఆనందం అక్షణమే నని తర్వాత తెలిసింది.

డెలివరీ అయిన రెండు గంటలకే, రవిని, తన బిడ్డను కూడా చూడకుండానే కన్ను మూసింది లావణ్య... లావణ్య చనిపోయిందనే నిజం రవికి ఎలా చెప్పాలో తెలియక అందరూ గుండెలవిసేలా ఏడ్చారు....

జరిగిందేమిటో తెలుసుకున్న రవి కొయ్య బారి పోయాడు.

పిచ్చివాడిలా అలాగే నిలబడి పోయాడు ...

రవి ఏమైపోతాడనే భయం మధుది... ఎలా ఓదార్చాలి?

ఒక్క సంవత్సరం మాత్రమే లావణ్య సంసారం చేసింది. కొన్ని యుగాలకు సరిపడినంత ప్రేమ అందించింది లావణ్య. .

లావణ్యను ఎలా మరచి పోగలడు రవి.

భారంగా సంవత్సరం గడిచింది...

రవి అమ్మ పసివాడిని చూసుకుంటూ అక్కడే ఉండి పోయింది. ఇరవై ఆరేళ్ళకే తన కొడుకు ఇలా ఒంటరివాడవుతాడని, ఇలా పిచ్చిగా తయారవుతాడని ఏమాత్రం ఊహించని ఆ తల్లి బాధ వర్ణనాతీతం. ...

"ఒరేయ్ ... మళ్ళీ పెళ్ళి చేసుకోరా"

అని ఓ రోజున తన మనసులోని మాట బయట పెట్టింది.

విరక్తిగా నవ్వేడు తప్ప జవాబివ్వలేదు రవి.

రవి నాన్నగారు కూడా కొడుక్కి రెండో పెళ్ళి చెయ్యాలనే పట్టుదలతో మంచి సంబంధం కోసం తిరగడం మొదలు పెట్టారు.... ఎలాగైతేనేం తెలిసిన వాళ్ళ సంబంధం దొరికింది.

అమ్మాయి పేరు రంజని. .. డిగ్రీ పాసయింది... అందంగా ఉంది... రవికి మంచి జోడీ ... రవి గురించి పూర్తిగ తెలుసుకునే మనస్ఫూర్తిగా ఒప్పుకుంది....

ఆరోజునుండి రవిని రంజనితో పెళ్ళికి ఒప్పుకునేలా చేయడానికి అమ్మా, నాన్న, ఆటు మధు ప్రయత్నాలు.... ఎవరు ఎన్ని రకాలుగా చెప్పినా రవి తన నిర్ణయం మార్చుకో లేక పోతున్నాడు.

"చూడు రవీ .... లావణ్యను మరచి పోలేవని తెలుసు.... కానీ బాబు సంగతి చూడు. ఇప్పుడంటే ఫరవాలేదు.... వాడికి ఊహ వచ్చింతర్వాత అమ్మ ఏదని అడిగితే నువ్వేం జవాబియ్యగలవు... నీకు భార్య అవసరం కన్నా బాబు భవిష్యత్తుకు అమ్మ కావాలి.... మా కోసం కాకపోయినా బాబుకోసం నువ్వీ పెళ్ళికి ఒప్పుకో... రంజని బాబును కన్న తల్లిలా చూసుకుంటుందనే నమ్మకం మాకుంది .. నీగురించి మీ అమ్మ, నాన్న ఎంతగా విలపిస్తున్నారో చూడు."

"ఒరేయ్.. . లావణ్యంటే మాకూ ప్రేమే.... అయినా ఏం చేయగలం.. ఇలా జరుగుతుందని ఊహించామా! ఏం వయసయి పోయిందని ఇలా తయారవుతున్నావు .. నీ జాతకంలో ద్వితీయ కళత్రం ఉందని చిన్నప్పుడు నవ్వుకునే వాళ్ళం గానీ ఇలా నిజమవుతుందని ఏరోజూ అనుకోలేదు బాబు కోసం నువ్వీ పెళ్ళికి ఒప్పుకో"

.మధు, రవినాన్నగారి మాటలు రవిమీద పని చేయలేదు....

రవి అమ్మ ఏడుపుతో మొదలు పెట్టింది.

"నీ కొడుకును ఎన్నాళ్ళు చూస్తానురా! ఎవరికైనా ఇచ్చేస్తావో, నువ్వే పెంచు కుంటావో, ఏ అనాథ శరణాలయంలో చేర్పిస్తావో నీ ఇష్టం '.. ఈ వయసులో ఈ భారం నా మీద వేసుకోలేను... "

అని ఖచ్చితంగా చెప్పింది ...

"నా మాట కూడా అదే . నువ్విలా పిచ్చివాడిగా ఉంటే మేము చూడలేంరా! నువ్వు పెళ్ళి చేసుకుని నవ్వుతుంటేనే నిన్ను చూసేది.. . లేకపోతే ఎవరికి వాళ్ళు దూరంగా బ్రతుకుదాం ..'

నాన్నగారి మాటలకు రవి అయోమయంలో పడ్డాడు.

"రవీ.... ఒప్పుకో... బాబు కోసం, మీ అమ్మ నాన్నల కోసం... నువ్విలా ఉంటే మాకు మనశ్శాంతి ఏం ఉంటుంది .. ఇప్పుడు బాధగా ఉన్నా రంజని నీ జీవితంలోకి అడుగు పెట్టిం తర్వాత మార్పు వస్తుంది లావణ్య లేని లోటు రంజని తీరుస్తుంది నీకు భార్యగా, బాబుకు అమ్మగా రంజని నీ కష్టసుఖాలలో తోడు, నీడగా ఉంటుంది...."

మధు అభ్యర్థన

చివరికి ఎలాగైతేనేం రవి రెండో పెళ్ళికి ఒప్పుకున్నాడు. ..

అమ్మా, నాన్న, మధు ఎంతో సంతోషించారు.

★ ★ ★ ★ ★

ఆఫీసు నుండి బయట పడి రోడ్డు మీద నడుస్తూనే ఆలోచిస్తుంది భారతి. తన నిర్ణయం చిన్న కాగితం మీద రాసి మంచం మీద పెట్టి, ఉదయం ఆఫీసుకు బయలు దేరింది. ఈ పాటికి ఇంట్లో అందరూ చదివే ఉంటారు. అందరూ చిందు లేస్తూ ఉంటారు.. . తను ఇంట్లోకి అడుగు పెట్టగానే విరుచుకు పడతారు.

భారతి అనుకున్నట్లుగానే జరిగింది

'నీకు మతి పోయిందా! పిచ్చి పట్టిందా"

అమ్మ గట్టిగా అరిచింది.

ఇదీ లోక నీతి

కంచుమర్తి వెంకటేశ్వరరావు

"మొగుడు పోయి సంవత్సరమైనా తిరగలేదు. అప్పుడే పెళ్ళికి తయారయ్యావు... నువ్వసలు ఆడదానివేనా!"

భారతి జవాబివ్వకుండా బట్టలు మార్చుకుని అమ్మమ్మ చేతిలో ఉన్న పాపను తీసుకుంది.

"నిన్నే అడిగేది ... సమాధానం చెప్పవేం"

నాన్న రంకెలు వేస్తున్నాడు

"అదెందుకు సమాధానం చెబుతుంది. ఇప్పటికే ఆఫీసులో తలెత్తుకు తిరగలేక పోతున్నాను ఆ వర్మ గాడితో దీని తిరుగుళ్ళు. నవ్వులకు అందరూ రకరకాలుగా చెవులు కొరుక్కుంటుంటే ఇక ముందు ముందు నేనసలు బయట తిరగలేను."

అన్నయ్య మండి పడుతున్నాడు.....

"మీ రెన్నైనా అనుకోండి.... నానిర్ణయం మారదు."

అని ఖచ్చితంగా చెప్పి పాపతో తన గదిలోకి వెళ్ళిపోయ్యింది భారతి.

మంచం మీద వాలి పాపను గుండెల మీద పడుకో బెట్టుకుని ఆలోచిస్తుంది....

మూడు సంవత్సరాల క్రితం ముచ్చటగా జరిగిన పెళ్ళి రెండు సంవత్స రాలకే ఆ ముచ్చట కాస్త తీరి పోయింది.

రఘుతో పెళ్ళయిన ఆరునెలలకు ఉద్యోగం రావడం.... మరో ఆరు నెలలకు తను తల్లి నవడం... ఇద్దరూ ఉద్యోగస్తులం .. పిల్లలను అందమైన బాటలో నడిపిద్దాం... అని ఎన్నెన్నో కబుర్లు చెప్పుకున్నారు.

కానీ.... సంవత్సరం క్రితం స్కూటరు మీద ఆఫీసు నుండి వస్తున్న రఘును లారీ గుద్దితే తనను చూడకుండానే కన్ను మూసాడు....

ఇరవై మూడేళ్ళ వయసుకే తన జీవితం ఇలా ముగుస్తుందని ఏ మాత్రం ఊహించని భారతి కన్నీరు మున్నీరుగా ఏడ్చింది.

"నువ్విలా బెంగపెట్టుకుంటే ఎలా! పాపకోసం మామూలు మనిషవ్వాలి" అని ఓదార్చేరు అంతా...

నెల్రోజుల తర్వాత బాధను గుండెల్లో దాచుకుని తిరిగి ఆఫీసుకు వెళుతుంది. ఉదయం, సాయంత్రం పాపతో గడిపేది....

ఒకే ఊర్లో అత్తా, మామయ్యలు, అమ్మా, నాన్నల ఇళ్ళు కావడంతో రోజూ వచ్చి చూసి వెళుతున్నారు.... నాన్న బలవంతం మీద వాళ్ళదగ్గరే ఉండసాగింది.

మూడునెలల తర్వాత భారతి జీవితంలో మార్పు.

ఆఫీసులో కొత్తగా జాయినయిన వర్మ భారతి మనసు పొరల్లో అంత తొందరగా చొచ్చుకు పోతాడని ఎవరూ ఊహించలేదు. స్వతహాగా మితభాషి.... మంచి మనిషి.... నిగర్వి.. అయిన వర్మ భారతి గురించి అంతా తెలుసుకుని ఆమెను పెళ్ళి చేసుకోవాలని నిర్ణయం తీసుకున్నాడు.

ఆరు నెలలకు తన మనసులోని మాట బయట పెట్టాడు.

"భారతీ.... నీ మీద జాలితో, సానుభూతితో నేనీ నిర్ణయం తీసుకోలేదు.... నువ్వంటే నాకిష్టం... మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను".

భారతి చాలా సేపటి వరకు మాట్లాడలేదు.

"ఆలోచించు భారతీ.... నీకు అంగీకారమైతేనే."

భారతి చాలా రోజులు ఆలోచించింది.

అప్పుడే ఏం వయసయి పోయిందని తను ఇలా మోడులా మిగిలిపోవాలి! తన కోసం హృదయాన్ని ఇస్తానంటున్నాడు! తన పాపకు తండ్రి నవుతానంటున్నాడు. ఇంకా ఏం కావాలి! మగవాళ్ళలో ఇంత మంచి వాళ్ళుంటారా!

ఆలోచించే కొద్ది భారతి మనసు వర్మ వైపే మొగ్గుతుంది.

Looking for Love?

Searching for happiness and Romance? You have found it..., The ultimate love Talisman. Individually prepared by occultist S. V. SASTRY. Details about the levendary love magnet send stamped cover.

PREMIER INSTITUTE OF ASTROLOGICAL STUDIES AND OCCULTISM

24, Jaishankar Street, MADRAS-600033. Phone:425822

Join Astrology Correspondence Courses.

ప్రియ పరిమళసున్నము

ప్రియలైమ్‌వర్క్స్

మచిలీపట్నం

Do it yourself at home with..

DELUXE

MINI PRINTING PRESS

A FRIEND IN NEED

A miracle in a GIFT PACK.

Prepare Rubber stamps and print colourfully.

Letter Heads, Cards etc

Price—Rs. 35/- only.

Postage Rs. 15/- Extra.



For V. P. Parcel write to –

YOUNG INDIA TRADING CORPN

161/1, Mahatma Gandhi Road. Calcutta-7

'ఉత్తరాలు' శీర్షికకి

రాసేవారు

తమపేరు, పూర్తి చిరునామా

తెలుగు లిపిలో రాయాలని

మనవి చేస్తున్నాము.

–సంపాదకుడు.

"ఇదీ లోకనీతి"

తను అంగీకరించవచ్చు.... వర్మ చేయినందించవచ్చు....

ఎందరు హర్షిస్తారు. ఇంకెందరు చీదరించుకుంటారు.

సదాచార కుటుంబం తమది.....

ఇంట్లో అమ్మా, నాన్న అంగీకరించరు .... ఏం చెయ్యాలి!

ఆచారం కోసం, అమ్మా, నాన్నకోసం తన జీవితాన్ని బలి చేయకూడదు... తన జీవితాన్ని తను అందంగా తీర్చిదిద్దుకోవాలి... చివరికి ఓ నిర్ణయానికి వచ్చింది భారతి.

డైరక్టుగా చెప్పితే ఎలా ఫీలవుతారోనని చిన్న కాగితం రాసి ఆఫీసుకు వెళ్ళింది... ఆఫీసులో కూర్చుందే గానీ ఆలోచనంతా ఇంట్లో రేగుతున్న అలజడి గురించే....

"పిచ్చి పిచ్చిగా ప్రవర్తిస్తే సహించేది లేదు"

ఉలిక్కి పడింది భారతి....

మంచం చుట్టూ అందరూ....

"కొడుకు పోయాడని వాళ్ళు బెంగ పెట్టుకున్నారు.... ఇప్పుడు నువ్వేం చేసినా వాళ్ళూ, మేమూ ఈ ఊర్లో తిరగలేం".

"అయినా మన వంశంలో ఇటువంటి పనులు జరగలేదు. వంశగౌరవానికి మచ్చ తెచ్చే ఏపని జరిగినా సహించను".

అమ్మా, నాన్నల మాటలు పూర్తిగ విని మంచం మీంచి లేచింది.

"మీ వంశానికి చెడ్డ పేరు రాకూడదు.... నా జీవితం ఇలా రాలిపోవలసిందేనా" సూటిగా అడిగింది భారతి....

"ఇలా జరుగుతుందని ఎవరూ ఊహించలేదు. అయినా జరిగిపోయింది. ఇప్పుడేం చెయ్యగలం!" అన్నయ్య....

"నాన్నా..... నావయస్సు ఇరవై మూడు.... ఈ వయసులో అన్ని కోరికలు, ముచ్చటలు చంపుకుని బ్రతకమనడం ఏమంత భావ్యం. వర్మ మంచితనం నాకు అందకపోతే ఇలాగే ఉండి పోదునేమో మీరు చెప్పినట్టు. కానీ అతని మంచితనం, త్యాగనిరతి, ప్రేమ నన్ను జీవితంలోకి అడుగు పెట్టమని ప్రోత్సహిస్తున్నాయి...." భారతి మాట సగంలోనే ఆగిపోయింది.

'అందుకు మేము ప్రోత్సహించడం లేదు'.

గట్టిగా అన్నాడు నాన్న.

"మీరు ప్రోత్సహించరని తెలుసు. వయసులో ఉన్న ఆడపిల్లను. బ్రతకాలంటే ఓ తోడు కావాలి. నా పాపకు తండ్రి కావాలి.. తండ్రి లేని పాపగా నలుగురిలో చిన్నబోకూడదు పాప.... నా తోడు, రక్షణకు అతను కావాలి. నా పాపకు తండ్రిగా అతను కావాలి.... తండ్రి ప్రేమను అందిస్తానంటున్నాడు... అంత మంచి మనిషి నీడ నాకు ముందు ముందు దొరకదు ఇప్పుడు దూరం చేసుకుంటే".

భారతి నెమ్మదిగా చెప్పింది.

"నీకు తోడుగా మేమంతా లేమా! పాపను మేము చూడమా"

అమ్మ ప్రాధేయ పడుతుంది.

"నాకు నిజమైన తోడు, పాపకు తండ్రి కాలేరుగా"

"అంటే ఏమిటి నీ మొండి పట్టుదల" చిరాగ్గా అన్నాడు అన్నయ్య.

"ఎవరు ఏమనుకున్నా నా నిర్ణయం మారదు..... దొరుకుతున్న ఆనందాన్ని దూరం చేసుకోలేను..." అని ఖచ్చితంగా చెప్పేసింది భారతి.

"ఛీ.... పాపిష్టి దానా! కుటుంబంలో చెడబుట్టేవు కదే! నీ నిర్ణయం అదే అయితే ఇంట్లోంచి బయటకు వెళ్ళు. నీకు అమ్మా, నాన్న, అన్నయ్య, అత్తా మామయ్యలు ఎవరూ లేరు.... అందరూ చచ్చినట్లే. జన్మలో మాకు ముఖం చూపించకు. నా కూతురు చచ్చి పోయిందని చెప్పుకుంటాం"

అని నాన్న భారతి పెట్టే బేడా గదిలోంచి బయటకు విసిరాడు.

"ఎంత అల్లారు ముద్దుగా పెంచాందీన్ని.... ఆడపిల్లని కూడా ఆలోచించకుండా చదివించాం.... వేలకు వేలు పోసి పెళ్ళి చేసాం.... ఇన్ని చేసినా విశ్వాసం లేకుండా కుటుంబ గౌరవాన్ని మంటగలిపి ఎవడితోనో కులకడానికి వెళ్ళి పోతుంది" అన్నయ్య.

"వెళ్ళమ్మా వెళ్ళు.... నువ్వింకా ఇంట్లో ఉంటే మా పిల్లలకూ చెడ్డ పేరు వస్తుంది... వాళ్ళ పెళ్ళిళ్ళవ్వవు...."

అసహ్యించు కుంటుంది వదిన.

భారతి కన్నీళ్ళాపు కుని పాపను భుజాన వేసుకుని చేతో పెట్టె పట్టుకుని బయటకు నడిచింది...

తలుపులు దభేలు మన్నాయి.

★ ★ ★ ★ ★

బంధు మిత్రుల సమక్షంలో, ఆకాశమంత పందిరేసి, కళ్ళు చెదిరేలా పెళ్ళి పీటలు అలంకరించి, ఆ సరదాలో అందరి చిరునవ్వులు, సంతోషాల మధ్య రంగ రంగ వైభవంగా రవి, రంజనిల పెళ్ళి జరిగింది. మగాడు .... ఎన్ని పెళ్ళిళ్ళ కయినా అర్హుడే అన్న నగ్నసత్యాన్ని లోకానికి చాటి చెబుతున్నట్టుగా ఘనంగా కానుకలందిస్తున్నారు.....

అదే సమయంలో ....

రిజిష్ట్రారాఫీసులో ....

దండలు మార్చుకుని హృదయాలు కలుపుకున్నారు భారతి, వర్మ. ఎన్ని తరాలు మారినా, ఎందరు సంఘ సంస్కర్తలు వెలసినా, ఎన్ని ఆశయాలు వల్లించినా ఆచరణలో ఎందరు ముందుకు వస్తారు... ఇంకెందరు ప్రోత్సహిస్తారు.... హర్షించే వాళ్ళు తక్కువ మంది అనడానికి, ఆశయాలను ఆచరణలో అమలు పరచి ఆశీర్వదించే వాళ్ళు చాలా చాలా తక్కువమంది అనడానికి నిదర్శనంగా నలుగురు స్నేహితులు హృదయ పూర్వకంగా అక్షింతలు జల్లి కానుకలందించారు....

ఇదీ లోకనీతి. ☐